# తెలంగాణ ప్రభుత్వం

# తూనికల కొలతల శాఖ కార్యాలయం

**గాంధీనగర్, హైదరాబాద్ – 500080**

---

**పత్రిక ప్రకటన :** **తేదీ : 27-07-2018**

రైతులకు సరైన క్వాలిటీ, క్వాంటిటీతో విత్తనాలను అందిస్తే వారికి ఆర్థికంగా తోడ్పాటు అందించినట్టు అవుతుందని తూనికల కొలతల శాఖ కంట్రోలర్ శ్రీ అకున్ సబర్వాల్ అన్నారు. రైతులు సౌకర్యవంతంగా ఉంటే దేశ ఆర్థిక ప్రగతి కూడా బాగుంటుందని అన్నారు. రైతు సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, దీన్ని గుర్తించి తూనికల కొలతల శాఖ నిబందనలను పాటిస్తూ విత్తనాల నాణ్యతా, తూకంలో ఏమాత్రం రాజీ పడొద్దని విత్తన కంపెనీ యాజమాన్యాలకు కంట్రోలర్ గారు విజ్ఞప్తి చేశారు.

విత్తనాల విక్రయంలో అక్రమాలకు పాల్పడుతూ తూకాల్లో రైతులను మోసం చేస్తున్నారని అనేక ఫిర్యాదులు రావడంతో తూనికల కొలతల శాఖ మే నెలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో 154 కేసులు నమోదు చేసి, రూ. 2.35 కోట్ల విలువ చేసే విత్తనాలను సీజ్ చేసింది.

ఈ నేపథ్యంలో తూనికల, కొలతల శాఖ నిబంధనలపై విత్తన ఉత్పత్తిదారులకు అవగాహన కల్పించడానికి తెలంగాణ సీడ్స్‌మెన్ అసోసియేషన్ శుక్రవారం నాడు ఫాప్సీ భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహించింది.

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కంట్రోలర్ శ్రీ అకున్ సబర్వాల్ మాట్లాడుతూ, నాణ్యతా తూకంలో సరైన ప్రమాణాలను పాటించకుండా రైతులను మోసగిస్తున్నారని విత్తన కంపెనీల మోసాలపై అనేక ఫిర్యాదులు రావడంతో, కొద్ది రోజుల క్రితం విత్తన కంపెనీలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా తూకంలో మోసాలు, విత్తనాలు తయారీ తేదీ, గడువు ముగింపు తేదీ, లైసెన్స్ లేకపోవడం వంటి లోపాలను గుర్తించడం జరిగింది.

విత్తన కంపెనీల విజ్ఞప్తి మేరకు తూనికల కొలతల శాఖ నిబంధనలు పాటించడానికి వారికి కొంత సమయం ఇవ్వడం జరిగింది. ఇక నుండి తూనికల కొలతల శాఖ నిబంధనల ప్రకారం లేబలింగ్ ఉండాలని అన్నారు.

రైతు సొమ్ము దోపిడీ గురికాకుండా చూసే ప్రధాన కర్తవ్యం తూనికల కొలతల శాఖపై ఉంది. ఈ బాధ్యతను సరైన విధంగా, సమర్ధవంతంగా నిర్వహించడానికి విత్తన ఉత్పత్తిదారులు కూడా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించేలా వ్యవహరించడం సరైన విధానం కాదు. ఈ విషయంలో వ్యాపార సంస్థల వైఖరిలో మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరించక తప్పదని హెచ్చరించారు.

రైతులకు విక్రయించే విత్తనాల విషయంలో నిజాయితీగా వ్యవహరించాలి. నిర్దేశించిన తూకం కంటే తక్కువ పరిమాణంలో విక్రయిస్తే రైతులకు ఆర్థికంగా తీవ్ర నష్టం చేసినవారవుతారు. ఇది క్షమించరానిది. మా ప్రాథమిక లక్ష్యం రైతాంగం మోసపోకుండా చూడడం. రైతులకు విక్రయించే విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల తూకాల్లో మోసాలకు పాల్పడడాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

విత్తనాల విక్రయంలో తూకంలో తేడాలు, కల్తీ లాంటి అక్రమాలకు పాల్పడి రైతాంగాన్ని మోసం చేయడానికి ప్రయత్నించకూడదని ఈ సందర్భంగా ఉత్పత్తిదారులకు కంట్రోలర్ గారు విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో సీడ్స్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్. జగదీశ్వర్, నిరంజన్, మల్లారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**నోట్ :** 1)తెలంగాణ సీడ్స్‌మెన్ అసోసియేషన్ అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న తూనికల కొలతల శాఖ కంట్రోలర్ శ్రీ అకున్ సబర్వాల్

2) తెలంగాణ సీడ్స్‌మెన్ అసోసియేషన్ అవగాహన సదస్సులో తూనికల కొలతల శాఖ నిబంధనల ప్రకారం విత్తన కంపెనీ ఉత్పత్తిదారులు కొత్తగా ముద్రించిన లేబుల్స్‌ను పరిశీలిస్తున్న కంట్రోలర్ అకున్ సబర్వాల్

---

తూనికల కొలతల శాఖ కార్యాలయం నుంచి జారీచేయబడినది